ఓటెత్తిన పల్లె జనం

- సరిహద్దు ప్రాంత ప్రజల్లో చైతన్యం
- వైఎస్సార్‌సీపీకి పట్టున్న పల్లెల్లో పోలింగ్ శాతం ఎక్కువ
- గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న పార్టీ నాయకత్వం


పోలింగ్ కేంద్రాల వద్ద బారులు దీరిన మహిళా ఓటర్లు

రాయదుర్గం: నియోజకవర్గ వ్యాప్తంగా ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు పల్లె జనం పోటెత్తారు. పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో 60 శాతం అదనంగా ఓటర్లలో చైతన్యం వచ్చింది. అన్ని మండలాల్లో సరాసరి 85 శాతానికి పైగా పోలింగ్ నమోదయ్యింది. పట్టణంలో 80.54 శాతం మాత్రమే అయ్యింది.

అత్యధికంగా డీ హీరేహాళ్ మండలంలో..

కర్ణాటక రాష్ట్రం బళ్లారి సరిహద్దుకు ఆనుకొని ఉండే డీ హీరేహాళ్ మండలంలో అత్యధికంగా 89.73 శాతం పోలింగ్ నమోదైంది. ఇదే మండలంలోని 15వ బూత్ హిర్దేహాళ్‌లో 584 ఓట్లు ఉండగా, 567 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 97.09 శాతంతో నియోజకవర్గంలోనే అత్యంత ఎక్కువ పోలింగ్ నమోదైన గ్రామంగా రికార్డుల్లో నిలిచింది.

అత్యల్పంగా రాయదుర్గం అర్బన్..

రాయదుర్గం అర్బన్ అత్యల్పంగా 80.54 శాతం పోలయ్యాయి. గ్రామాల విషయానికొస్తే కణేకల్లు 125వ బూత్ పరిధిలో 576 ఓట్లు ఉండగా, 352 ఓట్లతో 61.11 శాతం అత్యల్పంగా నమోదయ్యింది. మండలాల్లో రెండో స్థానం 88.61 శాతంతో రాయదుర్గం రూరల్, మూడో స్థానం 88.50 శాతం గుమ్మఘట్ట, నాలుగో స్థానం 86.39 శాతం బొమ్మనహాళ్, ఐదో స్థానం 84.81 శాతం గుమ్మఘట్ట, చివరి స్థానం 80.54 తో రాయదుర్గం అర్బన్ పోలింగ్ నమోదైంది.

పట్టున్న ప్రాంతాల్లోనే ఓటెత్తారు..

వైఎస్సార్‌సీపీకి పట్టున్న పల్లెల్లో పోలింగ్ అధిక శాతం నమోదైంది. ఈ నేపథ్యంలో వెల్లువెత్తిన ఓటింగ్ ఎవరికి అనుకూలం కానుందో నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ 9 గంటలకు 12.12 శాతం నమోదైంది. ఆ తర్వాత 11 గంటలకు 22.63 శాతం, ఒంటి గంటకు ఏకంగా 40.39 శాతం నమోదైంది. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు 56.33 శాతం, 5 గంటలకు 65.3 శాతం, పోలింగ్ ముగిసే సమయానికి 86.96 శాతం నమోదయ్యింది.

90 శాతం పోలింగ్ దాటిన గ్రామాలు ఇవే..

నియోజకవర్గంలోని 296 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వాటి పరిధిలోని డీ హీరేహాళ్ మండలం హిర్దేహాళ్ 15వ బూత్‌లో 97.09 శాతం ఓటు నమోదుతో మొదటి స్థానంలో నిలిచింది. కణేకల్లు మండలంలో 125వ బూత్‌లో 61.11 శాతం ఓటు నమోదతో చిట్టచివర బూత్‌గా రికార్డుల్లో నిలిచింది.78 బూత్‌ల్లో 90 శాతం పైబడి ఓటు నమోదైంది. మిగిలిన బూత్‌ల్లో 80, 70, 60 శాతం పైబడి ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు.

మండలాల వారీగా నమోదైన ఓట్ల వివరాలు

మండలం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
డి హీరేహాళ్	36,853	33,067	89.73
బొమ్మనహాళ్	46,680	40,329	86.39
కణేకల్లు	53,023	44,969	84.81
రాయదుర్గం రూరల్	34,548	30,613	88.61
రాయదుర్గం అర్బన్	53,439	43,038	80.54
గుమ్మఘట్ట	39,809	35,232	88.50
మొత్తం	2,64,352	2,27,248	86.96

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



పల్లెల్లో పెరిగిన ఓటింగ్ శాతంకు తోడు మహిళా ఓటు బ్యాంకు ఎక్కువ శాతం వైఎస్సార్‌సీపీ కే మొగ్గుచూపారు. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా జూన్ 4న ఫ్యాన్ ప్రభంజనం సృష్టిస్తోంది. మెట్టు గోవిందరెడ్డి రికార్డు స్థాయిలో మెజార్టీ సాధించనున్నారు. మునుపెన్నడూ లేని విధంగా రాయదుర్గం పట్టణ ఓటర్లు ఫ్యాన్‌కే పట్టం కట్టారని తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధించనుంది.

– పొరాళ్ల శిల్ప, మున్సిపల్ చైర్‌పర్సన్, రాయదుర్గం

రూ.కోటి విలువైన స్థలంపై కన్ను


వైఎస్సార్ విగ్రహానికి అడ్డంగా దారి ఏర్పాటు చేసిన దృశ్యం

రాయదుర్గం: పట్టణంలోని శాంతినగర్‌లో వైఎస్సార్ విగ్రహం వెనుకభాగంలో ఉన్న రూ.కోటి విలువజేసే ప్రభుత్వ స్థలం కబ్జాకు ఓ వ్యక్తి స్కెచ్ వేశాడు. సర్వే నంబర్ 225-ఏలో సుమారు 10 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. ఇదే స్థలాన్ని ఫోర్జరీ పట్టాలు సృష్టించి టీడీపీ హయాంలో కొందరు కబ్జాచేయాలని యత్నించారు. అప్పట్లో స్థానికులు అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు స్థలానికి ప్రహరీ నిర్మించి, స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ఓ వ్యక్తి ఈ స్థలం తన సోదరుడిది, తన వదిన పేరిట రిజిస్ట్రేషన్ కూడా అయ్యింది..దారి ఏర్పాటు చేస్తేనే విలువ వస్తుందని చెప్పున్నాడు. ఈ క్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పొరాళ్ల శిల్ప, అప్పటి కమిషనర్, తహసీల్దార్, వార్డు కౌన్సిలర్, స్థానికులు అడ్డుకున్నారు. కాలవకు అడ్డంగా కల్వర్టు నిర్మాణానికి అనుమతి ఇచ్చేదిలేదని తేల్చి చెప్పారు. అయినా అక్కడితో ఆగకుండా కాలనీకి దారిలేదని కోర్టును ఆశ్రయించాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో నిమగ్నమై ఉండగా, రాత్రికి రాత్రే మురుగు కాలవపై కల్వర్టు నిర్మించి, దారి ఏర్పాటు చేశారు.

పట్టించుకోని అధికారులు..

కబ్జాకు యత్నించే స్థలం సమీపంలో అనధికార లేఔట్ వెలిసింది. ఇష్టారాజ్యంగా ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఆ లేఔట్‌కు వెళ్లేందుకు దారి కూడా ప్రభుత్వ స్థలంలోనే 15 అడుగులు కేటాయించారు. దీనికి ఆనుకొని ఉండే పది సెంట్ల స్థలం సొంతం చేసుకునేందుకు మరో వ్యక్తి కుట్ర పన్నాడు. దీంతో కల్వర్టు నిర్మించారని ప్రజాప్రతినిధులు, స్థానికులు చెప్పున్నారు. దీనికి తోడు వైఎస్సార్ విగ్రహానికి ఎదురుగా దారి ఏర్పాటు చేయడంపై చాలా మంది అభ్యంతరం చెప్తున్నారు. విలువైన స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు లేదా మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఆదాయం సమకూరుతుందంటున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఆర్‌ఓ కరుణకుమారి కి ఫిర్యాదు చేశారు. ఈ స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

విత్తన వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకోండి


మాట్లాడుతున్న ఏఓ మధుకర్ తదితరులు

రాయదుర్గం రూరల్: ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తన వేరుశనగకోసం రైతులు ఈనెల18 నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని ఏడీఏ లక్ష్మానాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటా విత్తన వేరుశనగ రూ.9,500 ఉన్నట్లు తెలిపారు. 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం క్వింటా ధర రూ.5,700కు అందిస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి పైగా ఉన్న ఒక్కో రైతుకు గరిష్టంగా 30 కిలోల ప్యాకెట్ 1 నుంచి 3 వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు. 30 కిలోల ప్యాకెట్ ధర రూ.1,710 ప్రకారం చెల్లించాలని ఆయన తెలియజేశారు. సబ్సిడీ విత్తన వేరుశనగ కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, నగదుతో రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన కోరారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి ఈనెల 24 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి నమోదు చేసుకోండి

కూడేరు: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు విత్తన వేరుశనగకోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ విజయ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 40 శాతం సబ్సిడీతో విత్తన వేరుశన అందించనున్నట్లు ఆయన తెలిపారు. కే-6, టీపీజీఎస్ -1694 రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 30 కేజీల ప్యాకెట్ ధర రూ.2,850 కాగా, సబ్సిడీపోనూ రైతు రూ.1,710 చెల్లించాల్సి ఉంటుందన్నారు. విస్తీర్ణాన్ని బట్టి 1 నుంచి 3 ప్యాకెట్ల వరకు విత్తన వేరుశనగ ఇస్తామన్నారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

నేటి నుంచి రాయితీ వేరుశనగకు రిజిస్ట్రేషన్

వజ్రకరూరు: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో శనివారం నుంచి రాయితీ వేరుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ఏఓ మధుకర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విత్తన వేరుశనగతోపాటు కందులు, పిల్లిపెసర, దైంచా, జనము (పచ్చిరొట్ట ఎరువు) తదితర వాటిని కూడా అందించనున్నట్లు తెలిపారు.

విత్తన వేరుశనగ కోసం నమోదు

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న ఆర్బీకేల్లో విత్తన వేరుశనగ కోసం రైతుల పేర్లను శనివారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ నిర్మల్ కుమార్ తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, నగదు తీసుకొని రైతు భరోసా కేంద్రానికి వెళ్లాలన్నారు.

అయ్యా .. ఇదేం చాకిరీ?


తహసీల్దార్ చిట్టిబాబు కారును శుభ్రం చేస్తున్న వీఆర్‌ఏ నాగరాజు

రాయదుర్గం రూరల్: సార్వత్రిక ఎన్నికలు ఈనెల 13న ముగిశాయి. నిత్యం ఎన్నికల హడావుడిలో ఉండే అధికారులు, ఉద్యోగులకు ఉపశమనం కొంత లభించింది. ఇక సాధారణ విధుల్లో పాల్గొంటున్నారు. స్థానిక కార్యాలయానికి విధులకు వచ్చిన తహసీల్దార్ చిట్టిబాబు.. వీఆర్‌ఏ నాగరాజును ఖాళీగా ఎందుకు ఉంచాలనుకున్నాడో ఏమో.. ‘ఏయ్.. నా కారు నీటితో శుభ్రం చేయ్’ అంటూ ఆదేశించారు. సరే అయ్యా.. అంటూ వీఆర్‌ఏ బకెట్‌లో నీరు తెచ్చి కారు శుభ్రం చేశాడు. ఎన్నికల అనంతరం కార్యాలయానికి వచ్చిన ప్రజలు.. వీఆర్‌ఏ చేస్తున్న చాకిరీని చూసి గుసగుసలాడారు.

స్టోర్ డీలర్లకు నోటీసులు

రాయదుర్గం రూరల్: రేషన్ కార్డు హోల్డర్లకు బియ్యం, చక్కెర, రాగులతో పాటు రాగిపిండి పౌరసరాఫరాల శాఖ చౌక ధాన్యపు డిపోల ద్వారా సరాఫరా చేస్తోంది. అయితే రాగిపిండి నాణ్యత లేదని కార్డు దారులు రాగిపిండి తీసుకోలేదు. రాగిపిండి ప్యాకెట్లు వెనక్కి ఇవ్వమని పౌరసరాఫరాల శాఖ అధికారులు డీలర్లను ఆదేశించారు. దీంతో కొందరు వెనక్కిచ్చినా, మరికొందరు పెడచెవిన పెట్టారు. దీంతో డీఎస్‌ఓ ఆదేశాల మేరకు రాయదుర్గం సీఎస్‌డీటీ అనంతాచార్యులు రాగిపిండి వెనక్కి ఇవ్వని స్టోర్ డీలర్లకు నోటీసులు జారీ చేశారు. రాగిపిండి వెనక్కి ఇవ్వకపోతే కిలో ప్యాకెట్‌కు రూ .50 వంతున చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. లేకపోతే 6 ఏ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వెంటనే ప్యాకెట్లు అయినా వెనక్కి ఇవ్వాలి..లేదంటే ప్యాకెట్‌కు రూ.50 చొప్పున బఫర్ ప్రకారం నగదు చెల్లించాలని తెలియజేశారు.

టీడీపీ నాయకుడు ప్రభుత్వ స్థలం కబ్జా


కేపీ దొడ్డిలో టీడీపీ నాయకుడు కబ్జా చేసిన ప్రభుత్వ స్థలం

గుమ్మఘట్ట: మండలంలోని కేపీ దొడ్డిలో ప్రభుత్వ స్థలాన్ని టీడీపీ నాయకుడు దాదాపీర్ కబ్జా చేశాడు. గ్రామ ప్రజల ప్రయోజనార్థం వదిలిన స్థలాన్ని కబ్జా చేసుకొని అక్రమ నిర్మాణాన్ని చేపట్టాడు. అడ్డుకున్న గ్రామస్తులను అంతుచూస్తానని బెదరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు చెప్పున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ వెంకటేశ్వర్లును అడగ్గా, పరిశీలించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు వాసవీమాత జయంతి

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత, లోకపావని వాసవీమాత జయంతి శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. దివ్య మనోహర రూపం, కరుణాకటాక్ష వీక్షణాలతో భక్తులను అనుగ్రహిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి అత్యంత ఫలప్రదమని భక్తులు విశ్వసిస్తారు. గత ఐదు రోజులుగా సాగుతున్న నగర సంకీర్తన నేటితో ముగియనుంది. శనివారం ఉదయం నుంచే ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని కొత్తూరు, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరసింహులు, నాగరత్నం తెలిపారు. ఉదయం ప్రత్యేక అలంకార సేవల అనంతరం 9 గంటలకు గుత్తిరోడ్డు చౌడేశ్వరీ దేవస్థానం నుంచి 102 మంది కన్యలతో ప్రాచీన కళారూపాలతో కలశాల ఊరేగింపు చేశారు.

చురుగ్గా వ్యవసాయ గోదాము నిర్మాణం


కూడేరు: నిర్మాణంలో ఉన్న గోదాము

కూడేరు: కో–ఆపరేటివ్ బ్యాంక్ తరుపున కూడేరులోని జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం సమీపంలో నిర్మిస్తున్న వ్యవసాయ గోదాము నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. వెయ్యి మెట్రిక్ టన్నులను నిల్వ ఉంచే సామర్థ్యంతో ఈ గోదామును నిర్మిస్తున్నారు. పంటలకు దిగుబడి లేనపుడు రైతులు ఈ గోదాములో నిల్వ ఉంచుకోవచ్చు. ఎవరైనా శుభ కార్యాలు చేసుకోవచ్చు. నిల్వను, కార్యాన్ని బట్టి అద్దె చెల్లించాల్సి ఉంటుంది. వచ్చిన ఆదాయంతో సొసైటీ బ్యాంక్‌ను అభివృద్ధి పరుచుకునేందుకు అవకాశం ఉంటుందని సంబంధిత అధికార వర్గాలు వెల్లడించాయి.

కమనీయం.. కల్యాణోత్సవం


శ్రీలక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


ప్రత్యేక పూజలు అందుకున్న గజలక్ష్మీదేవి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని లక్ష్మీబజార్‌లో వెలసిన లక్ష్మీ నారాయణస్వామి కల్యాణోత్సవం, రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిపారు. ఉదయం 11:30 గంటల నుంచి 12:30 గంటల వరకు శ్రీవారి కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. అంతకు ముందు ఉదయం స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, పుష్ప అలంకరణ, తీర్థప్రసాద వినియోగం చేశారు. కల్యాణోత్సవం అనంతరం సాయంత్రం రథోత్సవాన్ని(గరుడసేవ) భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామి ఊంజల్ సేవా, అష్టావధానసేవ, మహామంగళ హారతి జరిగింది. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గెల్లి రామరాజు, గౌరవాధ్యక్షుడు బండి కిష్టప్ప, ఉపాధ్యక్షుడు కేబీ మధుసూదన, కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి, హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండు మారెమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ

బొమ్మనహాళ్: సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యాయి. జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడాల్సి ఉంది. అయితే పల్లెల్లో ఎక్కడ చూసినా గెలుపోటములపైనే చర్చ సాగుతోంది. పోలింగ్ ముగియడంతో కార్యకర్తలు, గ్రామస్థాయి లీడర్లు గెలుపోటములపైనే అంచనాలు వేసుకుంటున్నారు. మొత్తం ఓట్లు ఎన్ని? .. పోలైన ఓట్లు ఎన్ని? ..ఎవరికి ఎక్కువ మెజార్టీ వస్తుంది.. ఏ ప్రాంతంలో ఏ పార్టీకి ఓట్లు ఎక్కువ పడ్డాయి అనే అంశాలపైనే చర్చించుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన రోజు నుంచి నియోజకవర్గంలో ఏ నలుగురు గుమిగూడినా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపోటములపైనే మాట్లాడుకుంటున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, టీస్టాల్, హోటళ్లు, కార్యాలయాలు, దుకాణ సముదాయాలతో పాటు ఉపాధి పని ప్రదేశాలు, చెట్టు నీడన, రచ్చబండ వద్ద ఇలా ఎక్కడ చూసినా ఎన్నికల రాజకీయమే. కొందరు రాజకీయాలపైన ఆసక్తి ఉన్న వారు మీ నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి? ఎవరు గెలుస్తారు.. ప్రతి విషయమూ ఫోన్ల ద్వారా ఆరాతీస్తున్నారు. కొందరు నాయకులు చేసిన అభివృద్ధి, అభ్యర్థుల వ్యక్తిత్వం, వ్యతిరేకత, పంపిణీ చేసిన నగదు తదితర అంశాలపై అంచనాలు వేసుకుంటున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు వేసవి శిక్షణ


విద్యార్థులకు ఫుట్‌బాల్ నేర్పిస్తున్న దృశ్యం

విడపనకల్లు: ఉరవకొండలో నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాల్గో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వేసవి శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 1 నుంచి 21వ తేదీ వరకు స్పోకన్ ఇంగ్లిష్, మ్యాథ్స్, యోగా, ఏరోబిక్, డ్యాన్స్, భగవద్గీత శ్లోక పఠనం, నీతి కథలు, ముగ్గులు, చిత్రలేఖనం, షటిల్, సెపక్‌తక్ర, చదరంగం, ఫుట్‌బాల్,రూబిక్ క్యూబ్, పజిల్స్, ఇంగ్లిష్‌లో రాయడం చదవడం, తదితర వాటిపై విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

విడపనకల్లులో భారీ వర్షం


పెద్ద కొట్టాలపల్లి పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

విడపనకల్లు: మండలంలోని పెద్ద కొట్టాలపల్లి,పాలికి,విడపనకల్లు తదితర గ్రామాల్లో గురు,శుక్రవారాల్లో భారీగా వర్షం కురిసింది. వర్షం కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

వజ్రకరూరులో మోస్తరు వర్షం

వజ్రకరూరు: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కొనసాగింది. వర్షంకురవడంతో అన్నదాతలు వ్యవసాయ పనులు చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షం 19.2 ఎంఎంగా నమోదయినట్లు వీఆర్‌ఓ నూర్ మహమ్మద్ తెలిపారు.

బొమ్మనహాళ్‌లో వర్షం

బొమ్మనహాళ్: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. 28.0 మీ.మి వర్షపాతం నమోదు అయిన్నట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌తో పాటు ఉద్దేహాళ్, దేవగిరి క్రాస్, శ్రీధరఘట్ట గ్రామాలలో పెద్దగా గాలి లేకపోయినా వర్షం పడింది.

నాటుసారా విక్రేత అరెస్ట్

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప సమీపంలో మార్చి 6న పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడి చేశారు. అప్పట్లో పోలీసులను చూసి పరారయిన మృత్యుంజయను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. అతన్ని కళ్యాణదుర్గం కోర్టుకు హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించిందన్నారు.

కిడ్స్ సమ్మర్ బైబిల్ క్యాంప్


కరపత్రాలు విడుదల చేస్తున్న పాస్టర్ కిరణ్ కుమార్, సంఘం సభ్యులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలోని కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో 20, 21 తేదీల్లో కిడ్స్ సమ్మర్ బైబిల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పాస్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. చిన్న పిల్లలకు బైబిల్ బోధనలు, క్రమశిక్షణ, నైతిక విలువలు, బైబిల్ పాఠాలు నేర్పించనున్నట్లు తెలిపారు. శుక్రవారం చర్చిలో కిడ్స్ సమ్మర్ బైబిల్ క్యాంపు కరపత్రాలను విడుదల చేశారు. ఈ క్యాంపుకు అనంతపురం నుంచి ది ఇనాజింకల్ ఫెలోషిప్ బ్రదర్ మోజస్‌పాల్ హాజరవుతున్నట్లు చెప్పారు.

సచివాలయం తనిఖీ


తగ్గుపర్తి సచివాలయంలో రిజిష్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

బెళుగుప్ప: మండలంలోని తగ్గుపర్తి గ్రామంలోని గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ సుబ్బరాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో ఉద్యోగులు విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శంకర్, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లను అడ్డుకోండి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో అక్రమ అడ్మిషన్లు అడ్డుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు ప్రచారాలు చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నట్లు చెప్పారు. ఎంఈఓ-2 రమేష్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

అరుణాచలానికి ప్రత్యేక సర్వీసు

విడపనకల్లు: ఉరవకొండ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు శనివారం నుంచి నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం బాలాజీ దయాల్ ఓ ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

విడపనకల్లు: ఉరవకొండ పరిధిలోని నింబగల్లు గ్రామ వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు..విడపనకల్లు, బెళుగుప్ప మండలానికి చెందిన వైకేపీ ఏపీఎంలు రాంమోహన్, ఆంజనేయులు ఉరవకొండకు ద్విచక్రవాహనంపై వెళ్తూ నింబగల్లు వద్ద ఆటోను ఢీ కొన్నారు. ప్రమాదంలో రామమోహన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆంజనేయులుకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం రామమోహన్ అనంతపురానికి తీసుకెళ్లారు.

ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలి


పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : ప్రతి ఒక్కరూ డ్రైడే పాటించాలని మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని తీటకల్లు గ్రామ పంచాయతీ గ్రామాల్లో డ్రైడే ఫ్రై డే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.

ట్రెక్కింగ్ క్యాంపులో ప్రతిభ


ట్రెక్కింగ్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థినులు

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయిలో ట్రెక్కింగ్ క్యాంపులో ప్రతిభ కనబరిచారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని అహల్య, దీక్షతోపాటు 17 మంది 98 కిలోమీటర్లు ఊటీ, నంజనాడు, కెట్టి ప్రాంతంలో పదిరోజులు పాల్గొని ట్రెక్కింగ్ దిగ్విజయంగా పూర్తి చేశారని పీఈటీ శశికల, ప్రిన్సిపాల్ సత్యవతమ్మ తెలిపారు. అనంతరం విద్యార్థినులను అభినందించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


స్వామి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఊరేగిస్తున్న దృశ్యం

కణేకల్లు: మండల కేంద్రంలో శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. కాలజ్ఞాని వీరబ్రహేంద్రస్వామికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ట్రాక్టర్‌లో స్వామి చిత్రపటాన్ని కొత్తకొట్టాల నుంచి బస్టాండ్ వరకు ఊరేగించారు. స్వామి నామాన్ని స్మరించుకుంటూ భజనలతో ఊరేగించారు.

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, పంచామృతాభిషేకాలు, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు స్వామి రథోత్సవం: స్వామి ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని శనివారం రథోత్సవం ఉంటుందని గ్రామస్తులు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఆలయంలో పూజలు, అన్నదానం ఉంటుందన్నారు.

బెళుగుప్ప: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మం ఆలయంలో శుక్రవారం ఆరాధనోత్సవాలు ప్రారంభించారు. ఆశ్రమ పీఠాధిపతులు ఈశ్వర స్వామి బ్రహ్మంగారి మూలవిరాట్‌కు, శివలింగానికి, పోలేరమ్మ తల్లి విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, పుష్పార్చన పూజలు చేశారు. అనంతరం స్వామికి పల్లకీసేవ నిర్వహించారు. శనివారం వీరబ్రహేంద్రస్వామి, గోవిందమ్మ పంచలోహ విగ్రహాల రథోత్సవం చేయనున్నారు.


కణేకల్లులో వీరబ్రహేంద్రస్వామి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు